దిన పత్రిక
తొలి సమయం
ఆదివారం । 14 । జూన్ । 2026

## అలకుంట్ల కొమురయ్య ఆశయాలను సాధిస్తాం

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్**

**తొలి సమయం మహబూబాబాద్ జూన్ 13**



కంబాలపల్లి గ్రామ సభ్యులు అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అలకుంట్ల కొమురయ్య మరణం తీరని లోటు అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి లో అనారోగ్యం తో నేడు మరణించిన ఆయనకు ఎర్రగుడ్డను కప్పి జోహార్ అర్పించిన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు 1980 నుండి నేటి వరకు విప్లవ పార్టీ లో ఉన్నాడని అన్నారు. ప్రజల కోసం నిర్వహించిన అనేక విప్లవ పోరాటలలో చురుకైన పాత్ర ఉందన్నారు. పార్టీ రహస్య దళాలకు కోరియర్ గా సుదీర్ఘకాలం పనిచేశాడని ఉన్నారు. పార్టీ ప్రజా సంఘాలు నిర్వహించే సమావేశాలు ప్రజాపోరాటాలకు సమయపాలన పాటించిన క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని ఆడారు. ప్రజలపై రోజురోజు తున్న అధిక ధరల భారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంనురిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై ఐక్యంగా సమరశీలపోరాటాలు నిర్వహించాల్సిన నేటి తరుణంలో అనుభవం కలిగిన పార్టీ కార్యకర్తలు కోల్పోవడం బాధాకరమైన విషయం అని ఆయన ఆశయాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ చేయాలని అన్నారు. ఇంకా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, తో పాటు గా మాస్ లైన్ నాయకుడు బూర్గుల రమేష్ తుపాకుల వెంకన్న గ్రామ సర్పంచ్ ఇతర ప్రముఖులు కొమురయ్య అంతిమ యాత్ర లో పాల్గొన్నారు .

## ఎరువుల ధరలను పెంచి వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్న మోడీ ప్రభుత్వం: గౌని ఐలయ్య

**తొలి సమయం,మహబూబాబాద్ జూన్ 13:**




ఎరువులపై ఇప్పటి వరకు ఇస్తున్న సబ్సిడీని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవటం వలన వాటి ధరలు భారీగా పెరిగాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. పంటలకు మద్దతు ధర లభించక, పంటలను కొనే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగంపై ఎరువుల ధరలు పెరుగుదల పెను భారంగా మారనున్నదని ఆయన అన్నారు.ఎరువుల ధరల పెరుగుదలకు నిరసనగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఈరోజు బయ్యారం బస్టాండ్ సెంటర్లో జరిగిన ధర్నా నుద్దేశించి ఆయన ప్రసంగించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతుల పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఆచరణలో వారికి మొండి చేయి చూపించిందని మాటల్లో రైతు జపం చేస్తూ ఆచరణలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే చర్యలకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. వ్యవసాయ దిగుమతులపై సుంకాలు తగ్గించడంతో మన దేశంలోకి వ్యవసాయ ఉత్పత్తులు భారీ ఎత్తున దిగుమతి అవుతున్నాయని, తద్వారా అర కొరగా ఇస్తున్న మద్దతు ధరలకు కూడా రైతు పండించిన పంటను కొనే నాథుడు కరువయ్యాడని, మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు రైతులు తమ పంటలను ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటు న్నారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశంలో ప్రతి 30 నిమిషా లకు రైతు అప్పులబారినబడి ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇప్పుడు ఎరువుల భారం పెరగడంతో రైతుల తలపై పిడుగు పడినట్లు అయిందని ఆయన అన్నారు. ఎరువులకు ఇచ్చే సబ్సిడీలను కొనసాగించాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించి కొరత లేకుండా అవసరమైనన్ని ఎరువులను రైతాంగానికి సరఫరా చేయాలని ఐలయ్య డిమాండ్ చేశారు. ధర్నాకు ముందు గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రం నుండి బయ్యారం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిం చారు.

ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, ఇతర ప్రజా సంఘాల నాయకులు తోకల వెంకన్న,మోకాళ్ళ మురళీకృష్ణ, మైల యాకన్న, తుడుం వీరభద్రం, నేతకాని రాకేష్,రామగిరి బిక్షం, బానోత్ నర్సింహా,మెంగు భగవాన్,ధారావత్ మంగీలాల్, పూనెం లింగన్న,గంగారపు బిక్షం, నూతక్కి భూషణ్ రావు, వీరబోయిన ఐలయ్య,సజ్జ జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో కృషి చేయలేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

**తొలి సమయం మహబూబాబాద్ (కొత్తగూడ)13జూన్ 2026**

ములుగు జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని 12 సంవత్సరాల సుపరిపాలనపై మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనేక సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో కృషి చేయలేదని విమర్శించారు.కేవలం 12 సంవత్సరాల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశంలో మౌలిక సదుపాయాల విస్తరణ, రవాణా రంగ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, డిజిటల్ విప్లవం వంటి అనేక రంగాల్లో విశేష పురోగతి సాధించిందన్నారు.తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో లేకపోయినా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి సహకారం అందించిందని తెలిపారు. ములుగు ఏజెన్సీ ప్రాంతానికి గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేయడం, ప్రపంచ వారసత్వ కట్టడంగా రామప్ప దేవాలయానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం కేంద్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమని అన్నారు.అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే



అభివృద్ధి పనులు, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు మోదీ నాయకత్వంలోనే సాధ్యమయ్యాయని కొనియాడారు.రానున్న కాలంలో కూడా దేశ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వానికే మద్దతు తెలుపుతారని, మోదీ ముచ్చటగా నాలుగోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారని, భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల పరిరక్షణకు మైసంపల్లి వినూత్న నిర్ణయం

### సర్కారు పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే ఇంటి పన్ను మాఫీ

### విద్యార్థులకు ఆటో సౌకర్యం, ప్రభుత్వ పథకాల అమలుకు హామీ

**తొలి సమయం కొత్తగూడ 13 జూన్ 2026**

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, బలోపేతం కోసం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను పూర్తిగా మాఫీ చేయాలని గ్రామపంచాయతీ తీర్మానించింది.ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల వైపు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాలనే లక్ష్యంతో మైసంపల్లి గ్రామ సర్పంచ్, పాలకవర్గం ఈ ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు.గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు వారి ఇళ్ల నుంచి పాఠశాలకు రాకపోకల కోసం ఆటో సౌకర్యం కల్పించనున్నారు.



అలాగే అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని పాలకవర్గం వెల్లడించింది.ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి గ్రామస్థాయిలో తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విద్యా సంస్థల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీలు ముందుకు రావాల్సిన అవసరాన్ని ఈ చర్య మరోసారి గుర్తు చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం మైసంపల్లి




గ్రామపంచాయతీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం ఇతర గ్రామాలకు సైతం ఆదర్శంగా నిలుస్తుందని విద్యావేత్తలు, గ్రామస్థులు ప్రశంసిస్తున్నారు.